# క్రమశిక్షణతో మంచిపేరు తెచ్చుకోండి

కర్నూలు : క్రమశిక్షణతో మెలుగుతూ ప్రజలకు సేవచేసి పోలీసు శాఖకు, వ్యక్తిగతంగా మంచిపేరు తెచ్చుకోవాలని ఎస్పీ గోపీనాథ్‌జెట్టి అన్నారు. తిరుపతి, కడప జిల్లా, గుంటూరు జిల్లాలకు సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపిక కర్నూలు మండలం దిన్నెదేవరపాడులోని పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణకు వచ్చిన 172 మంది అభ్యర్థులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సేవా ద ృక్పథంతో విధులు నిర్వర్తించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. ఉన్నత విద్యార్హత కలిగిన పోలీసులు టెక్నాలజీపైన అవగాహన పెంచుకోవాలని, తిరుపతిలో కానిస్టేబుల్ కమాండ్ కంట్రోల్‌లో పనిచేస్తూ ఎన్నో కేసులు పరిష్కరిస్తున్నారని వివరించారు. సమాజంలో శాంతిని కాపాడుతూ దుష్టశక్తుల నుంచి ప్రజలను కాపాడాలని తెలిపారు. అదనపు ఎస్పీ షేక్‌షావలి మాట్లాడుతూ దురలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యం కాపా డుంటూ ఉత్తమ సేవలందించాలని సూచించారు. డీటీసీ డీఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ శ్రద్ధ, ఆసక్తులతో శిక్షణ పొంది వృత్తిలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది తిరుపతి అర్బన్-41, కడప-70, గుంటూరు-61 మంది కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

# తుంగభద్ర జలాల విడుదలకు సహకరించండి



కర్నూలు : కర్నూలు నగరం తాగునీటి గండం నుంచి బయట పడేందుకు అవసరమైన చర్యలను అధికారులు చేపట్టారు. తుంగభద్ర జలాశయం నుంచి కేసీ నీటివాటాలో కొంత నీటిని తీసుకొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి వస్తున్నాయి. ఈమేరకు కలెక్టరు సత్యనారాయణ ఆధ్వ ర్యంలో జలవనరులశాఖ ఎస్ఈ ఎస్.చంద్రశేఖర్‌రావు, నగరపాలక సంస్థ కమిషనరు హరినాథరెడ్డి తదితరులు బళ్లారిలో ఆ జిల్లా కలెక్టరు రాంప్రసాద్ మనోహర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాశయం నుంచి నీటి విడుదలపై చర్చించారు. కర్నూలు నగరంతోపాటు జిల్లా పశ్చిమ ప్రాంతాల్లోని తాగునీటి సమస్యను జిల్లా కలెక్టరు ఆయనకు వివరించారు. కాల్వకు విడుదల చేసిన నీరు జిల్లా సరిహద్దు వరకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ఇండెంట్ ప్రకారం విడుదల చేసేవిధంగా బోర్డుతో సమన్వయం చేయాలని కోరి నట్లు ఎస్ఈ చంద్ర శేఖర్‌రావు తెలిపారు. బళ్లారి కలెక్టరు స్పందించి కాల్వపై గస్తీ ఏర్పాటు చేస్తామని, జలచౌర్యం జరగ కుండా చర్యలు తీసు కుంటామని హామీ ఇచ్చారన్నారు. నీటి విడుదలపై ఈనెల 13న బెంగళూరులో జరిగే ఉన్నతస్థాయి బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని, ఎప్పటి నుంచి ఎంతనీరు విడుదల చేసేది బోర్డు వెల్లడిస్తుందని బళ్లారి కలెక్టరు తెలియజేశా రన్నారు. కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ హరి నాథ్‌రెడ్డి, డీఈ మనోహరెడ్డి, జలవనరులశాఖ డీఈఈ విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్షాభావంతో
# ఖరీఫ్‌కు నష్టం
### 20 శాతం దిగుబడులపై ప్రభావం
### పత్తి సాగు చేయొద్దు

ఆదోని : వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయని, ఫలితంగా 15 నుంచి 20 శాతం వరకు పంట దిగుబడులు తగ్గే అవకాశముందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నరసింహులు తెలిపారు. ఆదోనిలోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయంలో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు బాగా దెబ్బతిన్నాయని, ఆలూరు ప్రాంతంలో పరిస్థితి మరింత ఘోరంగా ఉందని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపుతామని చెప్పారు. ఎర్ర, నల్లరేగడి నేలల్లో పత్తి సాగు చేయొద్దని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర పంటలు సాగుచేయాలన్నారు. 130 రోజులకు పంట వచ్చే పీఆర్‌జీ 176, 158 రకాల కంది వేసు కోవాలన్నారు. సెప్టెంబరు నుంచి శనగ సాగు చేసుకోవచ్చన్నారు. పత్తిలో గులాబీ రంగు కాయ తొలిచే పురుగు ఆశించిందని, దీని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇది పూత దశలో వస్తుం దన్నారు. ఎకరాకు 4 నుంచి 8 వరకు లింగాకర్షణ బుట్టలు వాడా లన్నారు. అంతకుముందు ఆదోని డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో పర్య టించారు. ఈ సమావేశంలో ఏడీఏ చెంగల రాయుడు, వ్యవసాయ అధికారి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విధానాల స్పష్టతపై
# పార్టీలకు ఆహ్వానం

నంద్యాల : ఉప ఎన్నికల్లో నంద్యాల అభివ ృద్ధి ప్రతిపాదనలపై పార్టీ విధానాలను ప్రకటించేందుకు పార్టీ నాయకులను ఆహ్వానించామని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి తెలిపారు. నంద్యాల అభివృద్ధి గురించి రాజకీయ పార్టీల మధ్య స్పష్టమైన చర్చకు స్వాగతించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సుస్థిర అభివృద్ధి, దీరెకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని ప్రతిపాదనలు పార్టీల ముందు ఉంచుతున్నామని వాటిపై పార్టీల వైఖరి తెలియజేయా లని కోరుతూ ఆ పార్టీల ప్రతినిధులను కోరినట్లు ఆయన తెలిపారు. ఈ నెల 18న నంద్యాలలోని శశి రెసిడెన్సీ హెూటల్‌లో నిర్వహించే సమావేశంలో రాజకీయ పార్టీల నుంచి స్పష్టమైన వైఖరిని ఆశిస్తున్నా మన్నారు. కేసీ కెనాల్ పరిరక్షణకు గుండ్రేవుల జలాశయం నిర్మాణం, బచావత్ కమిషన్ ద్వారా కేసీ కెనాల్‌కు ఉన్న 10 టీఎంసీల నీటి వాటాను అనంతపురంకు బదిలీ చేస్తే అందుకు ప్రత్యామ్నాయంగా పోతిరెడ్డిపాడు ద్వారా కేటాయించిన 10 టీఎంసీల నీటి విడుదలపై, చట్టబద్ధంగా తుంగభద్ర, క ృష్ణా? నదుల ద్వారా కేటాయించిన 133.70 టీఎంసీల నికర జలాల్లో రాయలసీమ ప్రాజెక్టులకు లభించని 60 టీఎంసీల నీటిని పొందడంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు స్పష్టం చేయాలన్నారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో వీధిమూల ప్రదర్శనను తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వ్కెఎన్ రెడ్డి, పుల్లయ్యగౌడ్, పట్నం రాముడు, నాగెళ్ల శివప్రసాద్, దుర్వేశి వెంకటరెడ్డి, పోలూరు మహబూబుబాషా పాల్గొన్నారు.

## అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇవ్వండి

జిళ్లెల్ల : నంద్యాల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం అబ్దుల్ ఖాదర్‌ను గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న పాదయాత్ర ద్వారా గోస్పాడు మండలంలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. తెదేపా, వైకాపా, భాజపా పార్టీలన్నీ రాష్ట్ర విభజనకు మద్దతు లేఖలు ఇచ్చి మాపై నెపం మోపారన్నారు. ప్రత్యేక హెూదాతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తాము ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం 9 రకాల వస్తువులు అందించా మన్నారు. రైతులకు పూర్తిగా వడ్డీమాఫీ చేశామని పేర్కొన్నారు. అసెంబ్లీలో తమ వాణి వినిపించడానికి నంద్యాల నుంచి గతంలో ప్రధానమంత్రిగా పీవీ నరసింహారావు, రాష్ట్రపతిగా నీలం సంజీవ రెడ్డిని అందించినట్లే ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

## మద్దిలేటి స్వామికి
# రూ.57.72 లక్షల ఆదాయం

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రం మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం హుండీని లెక్కించినట్లు ఈవో ప్రసన్న లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం ఛైర్మన్ ఎల్లనాగయ్య, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రఘురాం ఆధ్వర్యంలో జరిగింది. స్వామి, అమ్మవారికి నాలుగు నెలల నుంచి భక్తులు సమర్పించిన కానుకలు, బంగారు, వెండి నగలను లెక్కింపు నిర్వహించారు. కానుకలు రూ.57,72,651 నగదు, 91.60 మి.గ్రా. బంగారం, 9.8 కిలోల వెండి ఆభరణాలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బేతంచెర్ల రాయలసీమ గ్రామీణ బ్యాంకు అధికారులు నిఖిల్ కుమార్, ఆలయ ధర్మకర్తలు రాధాకృష్ణ, సూర్యచంద్రారెడ్డి, మునీ శ్వరరెడ్డి పాల్గొన్నారు.

## బాల్య వివాహం నిలిపివేత

తర్లుపాడు : తర్లుపాడు నాయుడిపల్లెకాలనీలో ఓ బాల్య వివాహాన్ని హెల్ప్‌లైన్ ప్రతినిధులు నిలిపేశారు. హెల్ప్‌లైన్ కౌన్సెలర్ మరియదాసు తెలిపిన వివరాల ప్రకారం... నాయుడిపల్లెకాలనీకి చెందిన పదోతరగతి చదువుతున్న బాలిక(14)ను మార్కాపురం మండలం బోడపాడుకు చెందిన యువకుడికి ఇచ్చి శనివారం వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఈ విషయమై సమాచారం రావడంతో ఐసీడీఎస్, పోలీసు, రెవెన్యూ అధికారుల సహకారంతో... వివాహ ఏర్పాట్లను చైల్డ్‌లైన్ ప్రతినిధులు నిలిపేశారు. బాలికకు పద్దెనిమిదేళ్లు నిండకుండా పెళ్లి చేయడం తప్పని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై కె.వి.సబ్బమ్మ, ఎంఈవో సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, వీఆర్వో శేఖర్‌రెడ్డి, మానవ హక్కుల సంఘం జిల్లా ఉపకార్యదర్శి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్‌పై చర్యలకు మహిళల వినతి

పత్తికొండ: రక్షించాల్సిన రక్షక భటుడే తమకు సమస్యగా మారాడని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు అని కూడా చూడకుండా నిత్యం దుర్భాషలాడుతున్నాడని అడ్డు చెబితే బెదిరింపులకు దిగుతున్నట్లు వాపోతున్నారు. మద్యం మత్తులో నిత్యం వేధింపులకు పాల్పడుతున్న కానిస్టేబుల్ తీరుతో విసిగిపోయిన మహిళలు, కాలనీ వాసులు శుక్రవారం పత్తికొండ సీఐ విక్రమసింహను ఆశ్రయించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలు.

ఆస్పరి పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న డి.శ్రీనివాసరావు 10 ఏళ్లుగా పత్తికొండలోని సవారమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. అప్పటి నుంచీ కాలనీవాసులకు కష్టాలు మొదలయ్యాయి. చుట్టుపక్కల వాళ్లతో దురుసుగా ప్రవర్తించడం, పోలీసునని బెదిరించడం చేస్తున్నట్లు మహిళలు ఆరోపిస్తున్నారు. తాజాగా శుక్రవారం మరోసారి కాలనీ మహిళలను దురాషేలాడి, అడ్డు వచ్చిన వారిపై నానా హంగామా సృష్టించినట్లు వారు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతానని బెదిరిస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు భయం గుప్పిట్లో కాలం గడుపుతున్నారు. గతంలోనూ ఈయనపై ఇలాంటి ఆరోపణలు ఉన్నట్లు సమాచారం. ఆస్పరి మండలంలోని జొహరాపురంలో మద్యం మత్తులో అక్కడి ప్రజలపై హంగామా సృష్టించగా గ్రామస్థులు తిరగబడితే అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. కాలనీ మహిళల ఫిర్యాదు మేరకు సీఐ కానిస్టేబుల్‌ను పిలిపించి వివరణ కోరగా తాను ఎవ్వరి పట్లా దురుసుగా ప్రవర్తించలేదని సమాధానమిచ్చాడు. మద్యం తాగి ఉన్నాడన్న అనుమానంతో డ్రంకన్ పరీక్షలకు ఆసుపత్రికి తరలించాలని సీఐ సిబ్బందిని ఆదేశించారు. పరీక్షలకు తీసుకెళ్తుండగా వారి కళ్లు గప్పి తప్పించుకున్నట్లు సిబ్బంది సీఐకి ఫిర్యాదు చేశారు. వివాదానికి కారణమైన కానిస్టేబుల్ ఆస్పరి పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ ప్రస్తుతం సెలవులో ఉన్నట్లు సీఐ తెలిపారు. మహిళల ఫిర్యాదు మేరకు జిల్లా పోలీసు ఉన్నతాధికారికి నివేదిక పంపుతున్నట్లు సీఐ తెలిపారు.

# ఓటమి తప్పదనే జగన్ అనుచిత వ్యాఖ్యలు
### వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



నంద్యాల : నియోజకవర్గంలో జరిగే ఉప ఎన్నికల్లో వైకాపా 30 వేల తేడాతో ఓడిపోవడం ఖాయమని, అందుకే జగన్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఆయన పట్టణంలోని 14, 15వ వార్డుల్లో మాజీ ఆర్‌ఐసీ ఛైర్మన్ ఏవీ సుబ్బారెడ్డితో కలసి 15వ రోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న వ్యక్తన్నారు. రాష్ట్ర ప్రజలకు పారదర్శకమైన పాలన అందించారన్నారు. అలాంటి ముఖ్యమంత్రిని నడి రోడ్డులో కాల్చాలనడం, ఉరి తీయాలనడం వంటి వ్యాఖ్యలు చూస్తే ఎన్నికల్లో ఓడిపోవడం ఖాయమని తెలిశాకే ప్రజలను రెచ్చగొడుతున్నట్లు ఉందన్నారు. మేం ఎక్కడా ఎవరికీ ఓటుకు రూ.5 వేలు ఇవ్వడం లేదన్నారు. మేం నంద్యాలలో చేస్తున్న అభివృద్ధిని చూపి ఓట్లు అడుగుతున్నామని, డబ్బు సంచులు మాకు అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్లు మధుసాయి, జయసింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నంద్యాల ఉప ఎన్నికలో భూమా బ్రహ్మానందరెడ్డికి ఓటు వేసి తెదేపాను గెలిపించాలని రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ కోరారు. ఆమె మండలంలోని శ్రీరామనగర్, సత్యనారాయణపురం, జిళ్లెల్ల, కానాలపల్లె గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందరేగా మంత్రి మాట్లాడుతూ.. తమ కుటుంబం ప్రజా సేవకే అంకితమైందని పేర్కొన్నారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి అన్న బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని కోరారు.

## ఘనంగా యువజనోత్సవాలు
# అలరించిన సాంస్కృతిక పోటీలు

నెల్లూరు : అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని సెట్నెల్ ఆధ్వర్యంలో నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి 2కే రన్ కేవీఆర్ పెట్రోల్ బంక్ వరకు సాగింది.ఈ కార్యక్రమాన్ని హెూమ్ గార్డు డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు జెండా వూపి ప్రారంభించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సంయుక్త కలెక్టర్-2 వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ యువత అనుకుంటే సాధించలేనిది లేదని అన్నారు. యువత సన్మార్గంలో పయనించాలని సూచించారు.విద్య ద్వారా విజ్ఞానం వస్తుందని అటువంటి విజ్ఞానంతో ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నతంగా బతక గలమని పేర్కొన్నారు. గెలుపొందిన యువతకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సెట్నెల్ సీఈవో డాక్టర్ సుబ్రమణ్యం, పినాకిని యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్ రాజు, మహ్మద్ గయాజ్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలు
### మాజీ మంత్రి ఆనం



నెల్లూరు : నూతన పాలసీ విధానంతో రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రోత్సాహం ఉంటుందని మాజీ మంత్రి, తెదేపా నాయకులు ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు క్రీడలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. 7వ మినీ సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలు శనివారంతో ముగిశాయి. మూడు రోజుల నుంచి స్థానిక వీఆర్సీ మైదానంలో జరుగుతున్న విషయం తెలిసిందే. తుది పోరు శనివారం ఉదయం నుంచే ప్రారంభమయ్యాయి. గెలిచిన జట్లకు ఆనం రామనారాయణరెడ్డి చేతులమీదుగా పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివ ృద్ధికి క్రీడా సంఘాలు ఎంతో క ృషి చేస్తున్నాయన్నారు. క్రీడలపై ఆనం వివేకానందరెడ్డి ఎల్లప్పుడూ ముందంజలో ఉంటారని కొనియాడారు. వారి సహకారంతోనే జిల్లాలో క్రీడాభివృద్ధి జరిగిందని అభినందించారు. గెలిచిన జట్టు కన్నా ఎక్కడో మారుమూల ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చిన మిగతా రాష్ట్రాల వారిని అభినందించారు. మీతో క్రీడాసూర్తి పెరుగుతుందన్నారు. చివరి వరకు పోరాడి ఓడిన రాజస్థాన్ జట్టును అభినందించారు. మీలాంటి క్రీడాకారులు భావిదేశానికి ఎంతో అవసరమన్నారు. అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన శిక్షకులు, ప్రతినిధులు, క్రీడాకారులకు క ృతజ్ఞతలు తెలిపారు. మూడింటిలో విజయం సాధించిన ఆంధ్రప్రదేశ్ జట్టును ఉద్దేశించి మాట్లాడుతూ ఏ రంగంలోనైనా మన రాష్ట్రం ముందుండాలని అభిప్రాయపడ్డారు. ఒలింపిక్స్‌లోనూ పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈవో ప్రవీణ్ అనోకర్ మాట్లా డుతూ నగరంలో జరిగిన టోర్నమెంటులో క్రీడాకారులు ప్రతి ఒక్కరూ చక్కగా ఆడారని కొనియాడారు. ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ జట్టులోని బి.వరుణ్ కుమార్, పి.తేజ, ఎం.మహేష్, విష్ణు, భువి, రాధిక, జగదీష్‌లకు అభినందనలు తెలిపారు. ఆటలో మంచి ప్రతిభ కనబరిచారన్నారు. వర్కింగ్ అధ్యక్షుడు షణ్ముగం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జట్ల విజయాన్ని కొనియాడారు. రాష్ట్రంలో సాఫ్ట్ బాల్ క్రీడను మరింత అభివ ృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం కార్పొరేటరు ఆనం రంగ మయూర్ రెడ్డి, అసోసి యేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, నిర్వాహకులు రవి రాజు తదితరులు మాట్లాడారు. అండర్ -10 బాలికల విభాగంలో మధ్యప్రదేశ్, తెలంగాణ జట్ల మధ్య పోరు ఉత్కంఠంగా సాగింది. ఏ క్రీడాకారిణి వెనక్కు తగ్గకుండా తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పోరులో మధ్యప్రదేశ్ జట్టు విజయం సాధించింది. అనంతరం అండర్-10 బాలుర, అండర్-12 బాలబాలికల విభాగాల్లో ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ జట్ల మధ్యనే పోరు సాగింది. రెండు రాష్ట్రాల జట్లు మూడు విభాగాల్లో తలపడ్డాయి. ప్రతి బంతి రసవత్తరంగా సాగింది. వర్షంలోనూ క్రీడాకారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకుండా ఆటపైనే శ్రద్ధ పెట్టారు. అండర్-10 బాలుర ఆంధ్రప్రదేశ్ జట్టు విజయాన్ని కైవసం చేసుకుంది. అండర్-12 బాలికల పోటీలోనూ ఆంధ్రప్రదేశ్‌కే విజయం సొంతమైంది. భారీ వర్షమైనా క్రీడాకారుల్లో ఎలాంటి మార్పు కనిపించ లేదు. వారి లక్ష్యాన్ని కేవలం విజయంపైనే ఉంచారు. రెండు ఇన్నింగులు సాగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు భారీ విజయం సాధించింది. దీంతో ఆట ముగిసింది. గెలుపొందిన జట్లకు బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


## ఉత్తర రైల్వే
### టెండరు ప్రకటన

చీఫ్ ఇంజనీర్/టిఎంసి, ఉత్తర రైల్వే, హెడ్‌క్వార్టర్స్ ఆఫీసు, బరోడా హౌస్, న్యూఢిల్లీ-110001 వారు ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా దిగువ పనుల కొరకు టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

| క్ర. సం. | టెండరు నెం. | సంక్షిప్త వివరణ & డిఆర్‌జి నెం. | పరిమాణం | టెండరుకు ధరావత్తు విలువ (రూ.) | ధరావత్తు సొమ్ము (రూ.) | టెండరు డాక్యుమెంటు ధర (రూ.) | గడువు తేది సమయం |
|---|---|---|---|---|---|---|---|
| 1. | ఎ36పి90టిఎంసి2017 | యాంటీ వేర్ హైడ్రాలిక్ ఆయిల్ (హెచ్ఎల్‌పి రకము) విజి-68 గేర్ | 84840 లీటర్లు | 5411944.00 | 109000.00 | 1500/- | 13.09.17 11:30గం.ల వద్ద |
| 2. | ఎ30పి90టిఎంసి2017 | ప్లాసర్ పార్ట్సు నెం.9/064538నకు హెక్సబోల్డ్ కన్ఫర్మింగ్‌తో క్యాప్ | 120 నెం.లు | 696000.00 | 14000.00 | శూన్యం | 13.09.17 11:30గం.ల వద్ద |
| 3. | ఎ39పి90టిఎంసి2017 | హార్స్కో పార్ట్ నెం. 0230020202-0-01 నకు ఎన్‌టి-1 తత్సమానమునకై టిఆర్‌టి యంత్రముకై రబ్బరు ప్యాడ్ | 7403 నెం.లు | 577434.00 | 11600.00 | శూన్యం | 13.09.17 11:30గం.ల వద్ద |
| 4. | ఎ40పి90టిఎంసి2017 | టిఆర్‌టి యంత్రమునకై రోలర్ మ్యాగజైన్ | 230 నెం.లు | 696900.00 | 14000.00 | శూన్యం | 13.09.17 11:30గం.ల వద్ద |
| 5. | ఎ41పి90టిఎంసి2017 | కార్నర్ రోలర్, స్ప్రోకెట్ & ఫిల్టరుకై పిన్ | 06 ఐటంలు | 501328.00 | 10000.00 | శూన్యం | 15.09.17 11:30గం.ల వద్ద |
| 6. | ఎ42పి90టిఎంసి2017 | వేర్ ప్లేట్లు 64-08-1623 | 80 నెం.లు | 656000.00 | 13500.00 | శూన్యం | 15.09.17 11:30గం.ల వద్ద |
| 7. | ఎ43పి90టిఎంసి2017 | టాంపింగ్ యూనిట్ పిన్ & స్క్వీజింగ్ సిలిండర్ | 02 ఐటంలు | 353400.00 | 7100.00 | శూన్యం | 15.09.17 11:30గం.ల వద్ద |
| 8. | ఎ44పి90టిఎంసి2017 | టూలింగ్ బిల్డింగ్ సిలిండర్ & హైడ్రాలిక్ సిలిండర్ | 02 ఐటంలు | 575500.00 | 11600.00 | శూన్యం | 15.09.17 11:30గం.ల వద్ద |

గమనిక : పూర్తి వివరాలను ఐఆర్ఇపిఎస్ సైట్ **www.ireps.gov.in** లో డౌన్ లోడ్ చేసుకొనవచ్చును. ఇ-టెండర్ల పద్ధతి ద్వారా టెండర్లో పాల్గొనదలచిన సంస్థలు తమను పై వెబ్‌సైట్ నందు ఎలక్ట్రానికలీ నమోదు చేసుకొన వలెను. ఇందు కొరకు వారు భారతప్రభుత్వ ఐటి చట్టం 2000 ప్రకారం ఆమోదిత సర్టిఫైయింగ్ సంస్థలనుండి క్లాస్ III డిజిటల్ సర్టిపికెట్ (ఒక వేళ ఇప్పటివరకు పొందని ఎడల) పొందవలెను. ఇ-టెండరు పద్ధతిలో మ్యాన్యువల్ ఆఫర్లను ఆమోదించబడవు.
**2.** అందరు ఐఆర్ఇపిఎస్ అమ్మకందార్లు మరియు బిడ్డర్లు జిఎస్‌టి అధికారుల నుంచి జిఎస్‌టి నెం తీసుకొనవలెనని కోరడమైనది. ఖాతా ప్రొఫైల్స్‌లో జిఎస్‌టి వివరాలు అప్‌డేట్ చేసే సౌకర్యం త్వరలో కల్పించబడును. ప్రకటన నెం. 219-ఎస్/1/టిఎంసి/11/2017-18 తేది: 09.08.2017 **2432/17**

వినియోగదారులకు చిరునవ్వుతో సేవలు

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
Minimum 7 days
విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## రూ.17 కోట్లతో పర్యాటక అభివృద్ధి పనులు



విజయవాడ : నాగార్జున సాగర్ అనుపు ప్రాంతంలోని పురావస్తు శాఖకు చెందిన 104 ఎకరాల్లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ అభివృద్ధి పనులను రూ.17 కోట్లతో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ డైరెక్టర్ హిమాంశు శుక్లా అన్నారు. ఏపీ టూరిజం అధికారులు, పురావస్తుశాఖ అమరావతి, సూపరింటెండెంట్ టి.జయలక్ష్మి, ఏపీ టూరిజం కమిషనర్ ముఖేష్ కుమార్ మీనా తదితర ఉన్నతాధికారులు అనుపు ప్రాంతాన్ని పరిశీలించారు. హైదరాబాద్‌లోని గోల్కొండ, వరంగల్ కోటలో ఏర్పాటు చేసిన విధంగా అనుపులోని క్రీడా ప్రాంగణంలో సౌండ్ సిస్టమ్ ద్వారా బౌద్ధ చారిత్రక విశేషాలను పర్యటకులకు తెలిపేలా సన్నాహాలు చేసేందుకు ప్రణాళిక రచించినట్లు తెలిపారు. అనుపులో జెట్టీ పాయింట్ ఏర్పాటు చేసి స్పీడ్ బోట్లను ప్రవేశపెట్టి పర్యటకులను ఆకర్షించేందుకు అనువుగా ఉంటుందని నివేదిక రూపొందించినట్లు చెప్పారు.

పురావస్తు శాఖకు చెందిన 104 ఎకరాల్లో పర్యటక శాఖ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రతిపాదనలు పురావస్తు శాఖకు అందజేసినట్లు చెప్పారు. పర్యటకశాఖ అభివృద్ధిలో భాగంగా ఈ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. వారివెంట సాగర్ డీవీఎం శ్యాం ప్రసాద్, నాగార్జునకొండ కన్జర్వేషన్ అసిస్టెంట్ యు.వెంకటయ్య, హార్టికల్చర్ ఫోర్‌మెన్ హరినాథ్ ఉన్నారు.

## 13 నుంచి నెమలి ఆలయంలో పవిత్రోత్సవాలు

నెమలి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన గంపలగూడెం మండలం నెమలిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 13 నుంచి పవిత్రోత్సవాలు, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రారంభంకానున్నాయి. 13న సాయంత్రం 6గంటలకు పవిత్రోత్సవాలు ప్రారంభిస్తారు. 14న విశేష హోమాలు, పవిత్రమాలలకు శయనాధివాసం నిర్వహిస్తారు. 15న ఉదయం స్వామివారికి పవిత్రమాలల అలంకరణ, బాలభోగ నివేదన, 1008 తులసీ దళాలతో సహస్రనామ పూజ, 108 తామర పూలతో అష్టోత్తర శతనామ పూజ, బిల్వ, లాజ, అపూప, పాయస, పద్మ, సక్తు, సహిత, ద్వాదశాక్షరీ మహాయజ్ఞం, 9 రకాల ప్రసాదాలతో స్వామికి నివేదన చేస్తారు. సాయంత్రం 4గంటలకు నవనీతకృష్ణ అలంకృతులైన స్వామివారికి ఉట్టి కొట్టే ఉత్సవం నిర్వహిస్తారు. ఉభయదేవేరుల సమేతుడైన స్వామికి గ్రామోత్సవం చేస్తారు. రాత్రి ప్రధాన హోమం, వేణుగోపాల మహామంత్ర సహిత పౌణ్డరీక మహాశాంతి హోమం నిర్వహిస్తారు. 16న ప్రధాన హోమం, పూర్ణాహుతి, రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి శాంతి కల్యాణం, పవిత్ర విసర్జన, యజమానులకు బహుమానం చేస్తారు. ప్రధానార్చకులు టి.గోపాలాచార్యులు ఆధ్వర్యంలోని రుత్విక బృందం ఉత్సవాలను నిర్వహిస్తుంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు వి.రాజశేఖర్, ఈవో వె%.శివరామయ్య ఆధ్వర్యంలో పవిత్రోత్సవాలకు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందస్తు సాధన

గుంటూరు : ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకులకు స్థానిక పోలీసు కవాతు మైదానంలో ఏర్పాట్లు వేగవంతం చేశారు. జరగనున్న వేడుకలకు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వీవీఐపీలు, వీఐపీలు హాజరవ్వనుండడంతో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు. శుక్రవారం అర్బన్ ఏఆర్ డీఎస్పీ మెహర్‌బాబా, గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావులు పోలీసు కవాతు మైదానం చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు. జెండా వందనం, పోలీసుల కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలను ఎక్కడెక్కడ ఏ విధంగా నిర్వహించాలనే అంశాలపై చర్చించారు. కార్యక్రమానాకి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధులు, వీఐపీలు, అధికారులు, విద్యార్థులు కూర్చోవటానికి ప్రదేశాలను ఎంపిక చేశారు. వర్షాకాలం కావడంతో అనుకోకుండా వర్షం వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను చర్చించారు. అదేవిధంగా మరో మూడు రోజుల్లో వేడుకలు ఉండటంతో ఆ రోజు పోలీసులు నిర్వహించే కవాతును ముందస్తు సాధన చేశారు. డీఎస్పీ మెహర్‌బాబా, ఆర్ఐలు దీవన్‌రావు, నాగరాజులు పోలీసు సిబ్బందికి కవాతుపై శిక్షణ ఇచ్చారు.

## కీసర టోల్‌గేట్‌వద్ద వాహనాల రద్దీ

కంచికచర్ల : వరుస నాలుగు రోజులు సెలవులు రావడంతో హైదరాబాద్ నుంచి ప్రజలు స్వస్థలాలకు బయల్దేరారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కీసర టోల్‌గేట్ వద్ద భారీగా వాహనాల రద్దీ నెలకొంది. సుమారు అరకి లోమీటరు మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. టోల్‌గేట్ అధికారులు, సిబ్బంది పత్యామ్నయ ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## జేసీని కలిసిన వంశధార నిర్వాసితులు

శ్రీకాకుళం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా సంయుక్త కలెక్టర్ చక్రధర్‌బాబును వంశధార నిర్వాసితులు కలిశారు. ఆయన కార్యాలయంలో జేసీని కలిసిన నిర్వాసితులు అర్హులైన యువకులకు యూత్ ప్యాకేజీ అందించకపోవడం వలన ఉపాధి కొల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సంయుక్త కలెక్టర్‌కు అందజేశారు.

## సర్వజనాసుపత్రి శవగారం ఎదుట ధర్నా



గుంటూరువారితోట : మృతురాలి భర్త, అత్తను అరెస్టు చేయాలంటూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. నల్లపాడు కేంద్రీయ విద్యాలయం క్వార్టర్స్‌లో ఉంటున్న సీహెచ్.ప్రసన్న (32) గురువారం ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహన్ని సర్వజనాసుపత్రి శవాగారానికి తరలించారు. నల్లపాడు ఎస్ఐలు రాంబాబు, అమీర్‌లు శవ పంచనామా నిర్వహించి మృతదేహం అప్పగించేందుకు శుక్రవారం శవగారం వద్దకు చేరుకున్నారు. ఈలోగా మృతురాలి కుటుంబ సభ్యులు శవాగారం ఎదుట రహదారిపై భె%తాయించి ఆందోళనకు దిగారు. మృతదేహన్ని చూసేందుకు భర్త వెంకటేశ్వర్లు, అత్త గురవమ్మ శవగారం వద్దకు రాలేదని మండిపడ్డారు. ఆఖరికి ఇద్దరు పిల్లలను కూడా తల్లి మృతదేహం వద్దకు పంపించలేదని వాపోయారు. వారిద్దరినీ వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు అరగంటకుపైగా ధర్నా చేపట్టగా రహదారికి ఇరువె%పులా ట్రాఫిక్ నిలిచింది. కొత్తపేట, అరండల్‌పేట, పాతగుంటూరు ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్‌బాబు, శివప్రసాద్, బాలమురళీకృష్ణ, ట్రాఫిక్ పోలీసులు శవగారం వద్దకు చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పి ఆందోళనను విరమింపజేశారు.

మృతదేహనికి శవ పరీక్షలు నిర్వర్తించి అప్పగించే క్రమంలో సంతకాలు చేసేందు కుకుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో ఆమె మృతదేహన్ని శవాగారంలో భద్రఛపరిచారు.

## తెలుగు వెలుగు బస్సుల్లోనూ జీపీఎస్ విధానం

గుంటూరువారితోట : తెలుగు వెలుగు బస్సులు అన్నింటిల్లోనూ జీపీఎస్ పద్ధతిని విస్తరింపజేయాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈఅండ్ఐటీ) ఏ.కోటేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ బస్టాండ్ తిక్కన సమావేశ మందిరంలో సహాయ సీటీఎంలు, డీఎంలు, ఇతర విభాగాపు అధికారులతో సమావేశం జరిగింది. ఆర్ఎం శ్రీహరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ సర్వీసు, బస్సుల నంబర్లను తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాని ఆదేశించారు. ఈ యాప్ ద్వారా బస్సుల రాకపోకల సమాచారం తెలుసుకోవచ్చునని అన్నారు. తద్వారా ప్రయాణికులకు సమయం వృథాకాదని అన్నారు. నిర్దిష్టమైన వేళకు ప్రయాణికులు బస్టాండ్లు చేరుకుని బస్సు ఎక్కవచ్చునన్నారు. మార్గమధ్యలో సర్వీసు సిబ్బంది అలస్యమైన, బస్సుల్లో ఏవె%నా మరమత్తులకు గురైన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసే అవకాశం ఉందని చెప్పారు. ఆర్ఎం శ్రీహరి మాట్లాడుతూ గతేడాది జూలైతో పోల్చితే ఈ ఏడాది జూలైలో 58 శాతం నష్టాలు తగ్గించామని అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరి సమష్టి కృషి వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. ప్రయాణికులకు మరింత చేరువ అయ్యేందుకు గత నెల్లో ప్రయాణికుల ప్రాముఖ్యత వారోత్సవాలు ప్రారంభించినట్లు తెలిపారు.

అదే విధంగా మార్కెటింగ్ పథకాల అమల్లో గుంటూరు రీజియన్ ప్రథమంలో ఉందన్నారు. తెలుగువెలుగు బస్సులను గ్రామాల్లో ప్రయాణికులకు ఎటువంటి ఆటంకం లేకుండా నడపాలని సూచించారు. అనంతరం జీపీఎస్ పద్ధతిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా బస్సులెక్కడ ఉన్నాయి..? ఏ సమయానికి బస్టాండ్‌కు వస్తాయి..? అనే అంశాలను వివరించారు.

సహాయ సీటీఎంలు వాణిశ్రీ, వెంకటేశ్వరరావు, సహాయ సీటీఎంఈలు గంగాధర్, శరత్‌బాబు, ఏటీఎం సుబ్బారావు, కమర్షియల్ ఏటీఎం రమేష్‌బాబు, షెడ్యూల్డ్ సీఐ పిచ్చయ్య, కోర్ గ్రూప్ ఇన్‌ఛార్జ్ రమేష్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో భూముల సర్వేకి ప్రణాళిక

### డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

విజయవాడ : జిల్లాలో అన్‌సర్వే భూములను సర్వే చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని సర్వే శాఖ కమిషనర్ చల్లా విజయమోహన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని డీఆర్‌సీ సమావేశ మందిరంలో సర్వే శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయమోహన్ మాట్లాడుతూ రైతులకు లాభం కలిగేలా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ భూములను సర్వే చేపట్టి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. జిల్లాలోని కొండప్రోలు, కోగంటివారిపాలెం, నూజెండ్లపల్లి అగ్రహారం, సింగారుట్ల అగ్రహారం, తిమ్మాపురం, గుమ్మనంపాడు, అంగలూరు, వి.అప్పాపురం, లింగంగుంట్ల గ్రామాల్లో సుమారు 20 వేల ఎకరాల వరకు జమీందారి, ఇనాం భూములుగానే ఉన్నాయన్నారు. వాటిని సర్వే చేసి సంబంధిత చట్టం ప్రకారం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అభ్యంతరాలన్నింటిని పరిశీలించి భూమి పట్టాలు లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఆ పట్టాలపై యాజమాన్య హక్కు ఉన్నవారికే రుణాలు మంజూరు అవుతాయనే విషయం అధికారులు గ్రహించాలన్నారు. భూమి కొలతలు సక్రమమైన పద్ధతిలో సర్వే చేసి నిర్ధారించటంలో ఆ శాఖ కీలకమైన పాత్ర పోషించి, రెవెన్యూ శాఖకు సహకరించాలన్నారు. రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో వ్యక్తిగతంగా పర్యటించి సర్వే తీరును పరిశీలించాలని, వివాదాలకు తావులేకుండా భూమిని ధ్రువీకరించాలని, ఎటువంటి ఇబ్బందులున్నా ఉన్నతాధారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. భూమి జమిందారు, ఇనాం కింద ఉందా అనేది పరిశీలించాలని సూచించారు. దీనిపై గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు త్వరలోనే శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ఈ కార్యక్రమ ప్రగతిపై సమీక్ష జరుగుతుందన్నారు. అనంతరం వివరాలను, మ్యాప్‌లను డిజిటలైజేషన్ చేసి వెబ్‌సైట్‌లో లభించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఎఫ్ఎంబీ డిజిటలైజేషన్ వేగవంతం

ఎఫ్ఎంబీ డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంతం జరుగుతుందని కమిషనర్ చల్లా విజయమోహన్ తెలిపారు. అనుకున్నదానికంటే ముందుగానే డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ అయితే భూముల వ్యవహారంలో ఇబ్బందులు తొలగుతాయన్నారు.

ఒక సర్వే నంబరు నమోదు చేస్తే వివరాలన్నీ ప్రత్యక్ష మవుతాయని తెలిపారు. సమావేశంలో జేసీ క్రితికా శుక్ల, సర్వే శాఖ ఏడీ కేజియాకుమారి, ఆర్డీవోలు, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు కోరుతూ ఉపాధ్యాయుల ర్యాలీ

నర్సాపూర్ : సీపీఎస్ రద్దు చేసి పాతపింఛను విధానం అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. నర్సాపూర్‌లో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు ఉద్యోగం చేసి చివరకు పింఛన్ లేకుండా జీవించడం కష్టంగా ఉందన్నారు. సెప్టెంబరు ఒకటిన పింఛన్ విద్రోహ దినంగా ప్రకటించాలని, ఆ రోజు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా కలెక్టరు కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకు అన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలుకుతున్నాయని, ప్రతి ఒక్కరు ఇందులో పాల్గొనాలని కోరారు.

అనంతరం ఆర్డీవో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మనోహరచక్రవర్తికి వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మోయిజోద్దీన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సామ్యానాయక్, లాలు, శ్రీనివాస్‌రావు, రాంసింగ్, సుందర్‌రాజు, చందర్, చరణ్‌సింగ్, ఉపాధ్యాయులు మాధవి, వాణిశ్రీ, వినోద, స్వర్ణలత, రమేష్‌రాజు, గణేష్, రాజు, రవి, జెత్యా తదితరులు ఉన్నారు. కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం వల్ల 35 ఏళ్లపాటు ఉద్యోగం చేసిన వ్యక్తికి ఆ తర్వాత భద్రత కరవవుతోందని, ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ అంధకారమవుతోందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కొండల్‌రెడ్డి అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ టీపీటీఎఫ్, యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మెదక్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి పాతపింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ధర్నా అనంతరం తహసీల్దార్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య, ఉపాధ్యక్షులు రమేశ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మారావు, ఆయా సంఘాల బాధ్యులు సురేందర్, ప్రవీణ్, కిషన్, భూషణం, శీతల్‌సింగ్, వగ్రపసాద్, శ్రీకాంత్‌రెడ్డి, గణేశ్, పోచయ్య, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

## జిల్లాకు చేరిన రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర



శ్రీకాకుళం : తమిళనాడు రాష్ట్రంలోని శ్రీపెరుంబుదూరు పట్టణం నుంచి ఈనెల 9న బయలుదేరిన రాజీవ్ జ్యోతి సద్భావన యాత్ర జిల్లాకు చేరుకుంది. తమిళనాడు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.ప్రకాశం ఆధ్వర్యంలో సాగుతున్న ఈయాత్ర ఈనెల 20 నాటికి న్యూదిల్లీలోని రాజీవ్‌గాంధీ సమాధి వీర్‌భూమికి చేరుకుంటుంది. జిల్లాకు యాత్ర చేరుకున్న సందర్భంగా ఆబృందానికి జిల్లాకు చెందిన మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్, డీసీసీ అధ్యక్షులు డోల జగన్‌లతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికి వారికి ఆతిథ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకాశం మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈయాత్రను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

కోండ్రు మురళీమోహన్, డోల జగన్‌లు మాట్లాడుతూ ఉగ్రవాదం, మతవాదం దేశానికి చేటని, అవి ఏరూపంలో ఎదురైనా తిప్పికొట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ నాయకులు రత్నాల నర్శింహమూర్తి, ఎంఏబేగ్, పైడి రవి, దేశిల్ల గోవిందమల్లిబాబు, ఎ.రాధ తదితరులు పాల్గొన్నారు.

## 16న ఇచ్ఛాపురం నుంచి అగ్రిబాధితుల బస్సుయాత్ర

ఇచ్ఛాపురం : అగ్రిగోల్డ్ సంస్థ మోసాలతో కుదేలైన ఖాతాదారులు, ఏజెంట్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ 16న ఇచ్ఛాపురం నుంచి అమరావతికి బస్సుయాత్ర నిర్వహిస్తున్నట్లు ఇచ్ఛాపురం అగ్రిగోల్డ్ బాధితుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు రాష్ట్రసంఘం పిలుపునిచ్చిందని, శుక్రవారం ఇచ్ఛాపురంలో సమావేశమై బస్సుయాత్రకు తీర్మానించామన్నారు. ఇచ్ఛాపురంలో బహిరంగ సభను నిర్వహించి, ఆపై సోంపేట మీదుగా పలాస వరకు సాగుతామని, అక్కడ సభ ఉంటుం దన్నారు. టెక్కలిలో రాత్రి బస చేసి యాత్రను అమరావతి వరకు సాగించనున్నట్లు వారు పేర్కొన్నారు.

తమ సమస్య పరిష్కార విషయమై రాష్ట్రపభుత్వం పలు హామీలు ఇచ్చిందని వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా బాధితులను సంఘటితం చేసి, పోరాటం ఉద్ధృతం చేస్తామని జిల్లా అగ్రిగోల్డ్ ఖాతాదారులు, ఏజెంట్ల సంక్షేమసంఘం అధ్యక్షులు ఎం.జయసింహ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.గోవిందరావు, సాలిన నారాయణస్వామి, సిహెచ్.వెంకట రమణ, ఎన్.ప్రసాద్, లక్ష్మీనారాయణ, బిద్యాదరబెహర తదితరులు పేర్కొన్నారు. ఈమేరకు పట్టణ ఎస్సై బి.మంగరాజుకు వినతిపత్రాన్ని అందించారు.

## వచ్చే ఎన్నికల్లో భాజపాకే పట్టం

తలమడుగు : గ్రామాలను అభివృద్ధి చేయడంలో తెరాస ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని 2019 ఎన్నికల్లో భాజపాకు ప్రజలు పట్టం కట్టనున్నారని భాజపా రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. తలమడుగులో కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నరేంద్రమోదీ పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తెరాస పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోలేదని ఆరోపించారు. రైతులు, పేద ప్రజల అభ్యున్నతి కోసం మోదీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాయితీపై అందించిన వ్యవసాయ పనిముట్లు అర్హులకు ఇవ్వకుండా తెరాస కార్యకర్తలకు మాత్రమే పంపిణీ చేశారని ఆరోపిస్తూ ఈ మేరకు ఎంపీడీఓ సునీతకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మనాజీ, బోథ్ నియోజకవర్గ ఇన్ఛార్జి మాధవ్‌రావు హమ్‌టే, మండల అధ్యక్షుడు భువనగిరి స్వామి, ఉపాధ్యక్షుడు శిరిష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

